క్లుప్తంగా

ద్రాక్ష రసం పంపిణీ



తెనాలి: స్థానిక మారీసుపేట రెండు గేట్ల మధ్యన రజక వలంటరీ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో ఆదివారం ద్రాక్ష రసం పంపిణీ చేశారు. వీరవల్లి శ్రీరాములు, అనువులశెట్టి సతీష్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో 1,500 మందికి ద్రాక్ష రసం అందజేశారు. రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్, ఫణిదపు దుర్గ, పెదలంక వెంకటేశ్వరరావు, మోపిదేవి శ్రీనివాసరావు, ఉలసి సాయి చైతన్య, త్యాగరాజు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

గీత దాడితే కఠిన చర్యలు



కొల్లిపర: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవీంద్రరెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. నలుగురు కంటే ఎక్కువగా గుంపులుగా ఉండడం, ఫలితాల అనంతరం బాణ సంచా కాల్చడం, గ్రామాల్లో గెలుపు సంబరాలు చేసుకోవడం, ర్యాలీలు, రంగులు చల్లుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు చేయడం వంటివి పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. గొడవలు సృష్టించిన వారిపై కేసులు బనాయించడంతో పాటు అవసరమైతే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు.

శ్రీలక్ష్మి గణపతి సహిత హోమం



తెనాలిరూరల్: నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులు సమగ్రాభివృద్ధి సాధించాలని కోరుకుంటూ స్థానిక చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని నెహ్రూ నికేతన్ లిటిల్ వండర్స్ పేరుతో నూతనంగా ప్రారంభించిన శాఖలో యల్లాప్రగడ పవన్‌కుమార్ శర్మ, గొర్తి ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీలక్ష్మి గణపతి సహిత హోమం జరిపారు. నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పాల్గొన్నారు. 11 మంది బ్రాహ్మణ పండితులు నవ గ్రహ దానాలు, విశేష అన్న శాంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మురళీకాంత్ మాట్లాడుతూ స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న నెహ్రూనికేతన్ అమరావతి ప్లాట్స్‌లోని తమ శాఖలో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పూర్తి స్థాయి డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెహ్రూనికేతన్ వ్యవస్థాపకులు డి.ప్రకాశరావు, రంగలక్ష్మి దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు భక్తులు పూజలు



ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై కొలువైన కార్మెల్ మాతను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఆళ్లగడ్డ, ధర్మవరం, మాచర్ల ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల ద్వారా అధిక సంఖ్యలో వచ్చారు. కార్మెల్ మాతకు తలనీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి



మృతి చెందిన ఉదయ్ భాస్కర్

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన సంకురాత్రిపాటి ఉదయ్‌భాస్కర్(56) నగరంలో హోంగార్డుగా పనిచేస్తుంటాడు. రోజు మాదిరిగానే శనివారం తన ఆటోలో విధులకు హాజరయ్యాడు. అనంతరం విధులు ముగించుకుని ఇంటికి తన ఆటోలో వెళుతుండగా నల్లపాడు కేంద్రీయ విద్యాలయం వద్ద కుక్కను తప్పించబోయి ఆటో డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఉదయ్ భాస్కర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భూమి సారవంతం.. రైతుకు ఆదాయం

- పచ్చని పంటకు మేలైన పచ్చిరొట్ట
- మొక్కలకు పోషకాల లభ్యత
- సాగుకు సరైన సమయం
- అధిక దిగుబడులకు దోహదం
- 50శాతం రాయితీతో ఆర్బీకేల్లో అందుబాటులో విత్తనాలు



కొల్లిపరలో జీలుగ పంటను పరిశీలిస్తున్న ఏవో వెంకటరావు(ఫైల్)

కొల్లిపర: రైతులు వరి సాగుకు ముందు పొలాల్లో పచ్చి రొట్ట వేయడం నేలకు ఎంతో మేలు చేస్తుంది. భూముల్లో సేంద్రియ కర్బణం పెరిగి పంట దిగుబడులు పెంచుకోవచ్చు. అధిక మోతాదులో వేసే రసాయనిక ఎరువులతో భూమి సారం కోల్పోతుంది. పచ్చిరొట్ట పైర్ల సాగుతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులను పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. భూమిని సారవంతం చేసుకోవడానికి వరి పంట సాగు చేసే పొలంలో పచ్చిరొట్ట ఎరువులు జీలుగలు, పిల్లిపెసర, జనుము సాగు చేసి, పూత సమయంలో కలియదున్నడం వల్ల నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తాయి.

పచ్చిరొట్టతో లాభాలు..

పచ్చి రొట్టను భూముల్లో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. భూమి బాగా గుల్ల బారుతుంది. భూమిలో స్థూల సూక్ష్మ పోషకాల లభ్యత పెరుగుతుంది. భూమికి తేమను ఎక్కువ రోజులు నిలుపుకునే శక్తి వస్తుంది. పంట నాణ్యత పెరుగుతుంది. పంటకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. పచ్చిరొట్టకు వేరు బుడిపెలు ఉండటం వల్ల నత్రజనిని స్థిరీకరిస్తాయి. సారవంతమైన నేలలను చౌడు భూములుగా మారకుండా నివారిస్తాయి. ఒక వేళ భూముల్లో లవణాల సంఖ్య ఎక్కువగా ఉంటే వాటిని తగ్గించి, సారవంతమైన భూమిగా చేస్తాయి.

ముఖ్యమైన పచ్చిరొట్ట..

పచ్చిరొట్ట ఎరువును ప్రత్యేకంగా పెంచి పూత వచ్చే దశలో భూమిలో కలియదున్ని తగినంత నీరు పెట్టి కుళ్లనివ్వాలి. ఇందులో జీలుగ, జనుము, పిల్లిపెసర వంటివి పచ్చిరొట్ట పైరు.

పచ్చి ఆకు ఎరువు..

పచ్చిరొట్ట ఎరువును పండించడానికి అవకాశం లేనప్పుడు పచ్చిరొట్ట ఆకులు, లేత కొమ్మలు బయటి నుంచి తెచ్చి పొలంలో వేసి కలియదున్నాలి. తగినంత నీరు పెట్టి కుళ్లనివ్వాలి. ఉదాహరణకు నేల తంగెడి, సుబాబుల్, గానుగ తదితరాలు.

జీలుగలు...

జీలుగ పైరును తేలికపాటి నేలలు, చౌడు భూముల్లోనూ సాగు చేయవచ్చు. చౌడులో ఉన్న లవణాలను తీసివేసి మంచి భూమిగా తయారు చేయడానికి ఈ జీలుగ పైరు ఉపయోగపడుతుంది. జీలుగ నుంచి ఎకరానికి ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువులో నీరు ఇంకిపోయే తేలికపాటి ఎర్ర నేలల్లో, ఇసుక నేలల్లో బాగా పెరుగుతుంది. ఈ జనుమును పచ్చిరొట్ట ఎరువుగా, పశువులకు మేతగానూ ఉపయోగపడుతుంది. జనుము పైరు త్వరగా పెరిగి మృదువైన ఆకులను ఇస్తుంది. ఎకరానికి 15 కిలోల విత్తనం అవసరం. పైరు పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నాలి. ఎకరానికి 5 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువులో 16–24 కిలోల నత్రజని ఉంటుంది. అంతే కాకుండా 75 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ వస్తుంది.

పెట్టుబడి వ్యయం తగ్గుతుంది..

జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర రకాలను రబీ, ఖరీఫ్‌కు మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్ పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకూ ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. పచ్చిరొట్ట సాగుతో 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడడానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో వీటి సాగుతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.

అందుబాటులో విత్తనాలు

తెనాలి నియోజవర్గంలో తెనాలి, కొల్లిపర మండలంలో ఇప్పటికే విత్తనాలు వచ్చాయి. కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా డీ–క్రిష్ దరఖాస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకుని రైతు వాటా డబ్బులు చెల్లిస్తే ఏపీ సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలు పొందొచ్చు. కొల్లిపర మండలానికి 5 క్వింటాళ్ల జీలుగ, పిల్లిపెసర 12.5 క్వింటాళ్లు, జనుము 32.75 క్వింటాళ్లు వచ్చాయి. 50శాతం రాయితీపై అందిస్తున్నారు.

50 శాతం రాయితీతో విత్తనాలు



రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి పచ్చి రొట్టె ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం 50 శాతం రాయితీతో పచ్చరొట్ట విత్తనాలను అందజేస్తోంది. ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకొచ్చి విత్తనాలు పొందొచ్చు. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలిగియదున్నడం వల్ల సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సహజంగా చౌడు బారిపోయిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది.

– కె.వెంకటరావు, ఏఓ, కొల్లిపర

వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని ప్రార్థన

తెనాలిరూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని, తెనాలి ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్ మరోమారు గెలుపొందాలని స్థానిక ఇస్లాం పేట ఏసయ్య ప్రార్థన కొండ చర్చిలో సంఘ కాపరి బ్రదర్ ఆనందన్న ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం సంఘస్తులంతా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దైవ సేవకురాలు పి.రత్నకుమారి, బ్రదర్ పి.చార్లెస్ వెస్లీ, ప్రశాంత్ బాబు, సీమోను, ఇతర సంఘస్తులు పాల్గొన్నారు.

గోపాలకృష్ణ మృతి బాధాకరం



తెనాలి: తెనాలికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఆర్.ఎన్.గోపాలకృష్ణ మృతి బాధాకరమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన సంతాప సభలో గోపాలకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గం అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పాత్రికేయుడిగా, ఉపాధ్యాయుడిగా చేసిన సేవలను బీసీ సంక్షేమ సంఘం నేత కేసన శంకరరావు, సీనియర్ పాత్రికేయుడు నిమ్మరాజు చలపతిరావు స్మరించుకున్నారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



శ్రీచిట్టి ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ



స్వామికి విశేష నక్షత్ర పూర్వక మన్యుసూక్త హోమం



అరి హనుమత్ గాయత్రి హోమం

తెనాలి: పట్టణ షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో 16వ వార్షిక లక్ష హనుమాన్ చాలీసా పారాయణ, శ్రీ హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం నుంచి ప్రారంభమైన ఉత్సవాలు జులై 11వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా పంచముఖ ఆంజనేయ స్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు ఆదివారం వైదిక క్రతువును వైఖానస పండితులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం అరి హనుమత్ గాయత్రి హోమం చేశారు. భక్తులతో 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేయించారు. మహిళలు విశేషంగా పాల్గొన్నారు. స్వామికి జంబీర ఫలార్చన చేశారు. సుందరకాండ ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు. నిఖిల్ శాండిల్య, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, ఆర్.సురేష్, ఎం.వెంకటేష్, కె.రాజశేఖర్, బి.లీలాప్రసాద్, గోలి సోమశేఖర్, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి మన్యుసూక్త హోమం

తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో గల శ్రీచిట్టి ఆంజనేయస్వామి మందిరంలో శత జయంతి మహోత్సవాలు, హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ఈ ఉత్సవాల్లో రెండో రోజు ఆదివారం వైశాఖ బహుళ ఏకాదశి రోజున ఉదయం 9 గంటలకు విశేష నక్షత్ర పూర్వక మన్యుసూక్త హోమం జరిపించారు. వైఖానస ఆగమ పండితుడు వేదాంతం వెంకట నాగమారుతి ఈ హోమాన్ని జరిపారు. అనంతరం పూర్ణాహుతి, ప్రసాద వినియోగం చేశారు. ఆలయ అర్చక స్వాములు దీవి యోగానంద చక్రవర్తి, దీవి వేణుమాధవ్ పూజలు చేశారు. రాత్రి ఏడు గంటలకు హనుమద్వైభవం ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మధుర వాగ్వసంత, వాక్సుధానిధి, తిరుమల తిరుపతి, శ్రీశైల దేవస్థానముల వ్యాఖ్యాత దీవి హయగ్రీవాచార్యులు హనుమద్వైభవంపై చేసిన ప్రసంగాన్ని భక్తులు ఆసాంతం భక్తిశ్రద్ధలతో ఆలకించారు. గోనుగుంట్ల శ్రీనివాసరావు–సంధ్యారాణి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి, సభ్యులు పర్యవేక్షించారు.

ఉదాసీనత.. రోగులకు శాపం



వైద్యశాలలో మూసి ఉన్న సిటీ స్కాన్ గది



పాడైన సిటీ స్కాన్ యూనిట్

- నిలచిపోయిన సిటీ స్కానింగ్ సేవలు
- మూడేళ్ళ క్రితం మంజూరైన నూతన యూనిట్
- ఇతర ప్రాంతానికి తరలింపు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

తెనాలి అర్బన్: అధికారుల ఉదాసీనతతో తెనాలి జిల్లా వైద్యశాలలోని సిటీ స్కాన్ యూనిట్ సేవలకు గ్రహణం పట్టింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నూతన యూనిట్‌ను మంజూరు చేయించి దానిని తెనాలి తెచ్చేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించిన ఉన్నతాధికారులు తగిన చొరవ చూపలేదు. అంతేకాకుండా ఉన్నతాధికారులు తెనాలి రావాల్సిన యూనిట్‌ను ఇతర జిల్లాకు పంపడంతో.. డివిజన్ పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తెనాలి జిల్లా వైద్యశాల 250 పడకలతో ఆదే ఆవరణలో ఉన్న తల్లిపిల్లల వైద్యశాల 150 పడకలతో ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాలోని తెనాలి, మంగళగిరి, బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, కొల్లూరు, రేపల్లె, అమృతలూరు, చుండూరు తదితర మండలాల పేద ప్రజలు ఇక్కడ వైద్య సేవలు పొందుతుంటారు.

సిటీ స్కానింగ్ యూనిట్ సేవలు..

తెనాలి జిల్లా వైద్యశాలలో 2008 నవంబర్ 14న సిటీ స్కానింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దీని సేవలు కొనసాగిస్తున్నారు. బ్రెయిన్, చెస్ట్, పొట్ట(అబ్డామిన్)కు సంబంధించిన వివిధ రకాల స్కానింగ్ చేస్తున్నారు. ప్రతిరోజు సుమారు 20 మందికి సేవలందిస్తున్నారు. కోవిడ్ ప్రారంభమైన సమయంలో కోవిడ్ నిర్ధారణ కిట్స్ పంపిణీలో జాప్యం జరిగినప్పుడు సిటీ స్కాన్‌ను ఆధారంగా చేసుకుని వైద్యులు సేవలు అందించారు. అనంతరం యూనిట్ మోరాయించటంతో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దానిని వెంటనే బాగు చేయించాలని అప్పట్లో ఆదేశించారు. ఆ తర్వాత అది కొద్ది నెలలకే అది అటకెక్కింది. టెక్నీషియన్లు పరిశీలించి పరిమితికి మించి ఉపయోగించారని, బాగుచేయడం కష్టమని తేల్చారు.

తరలిన యూనిట్..

తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జిల్లా వైద్యశాలలో నూతన సిటీ స్కాన్ యూనిట్‌ను మంజూరు చేయించాలని ప్రభుత్వాన్ని మూడేళ్ల క్రితం కోరి అనుమతులు తెచ్చారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో పలుమార్లు మాట్లాడి త్వరగా యూనిట్ పంపించే విధంగా చూడాలని కోరారు. ఈ క్రుమంలో ఉన్నతాధికారులు రాష్ట్రంలోని మూడు ప్రభుత్వ వైద్యశాలల్లో ఏర్పాటు చేసేందుకు నూతన సిటీ స్కాన్ యూనిట్‌లు కొనుగోలు చేశారు. తెనాలి నూతన యూనిట్ వస్తుందనుకుంటున్న తరుణంలో ఆ యూనిట్‌ను వేరే జిల్లాకు తరలించారు. అనంతరం కొనుగోలు చేసే యూనిట్‌లలో ఒక దానిని తెనాలి పంపుతామని అప్పట్లో ఉన్నతాధికారులు తెలిపినప్పటికీ ఇంత వరకు సాధ్యపడలేదు.

ఇబ్బందులు పడుతున్న రోగులు

తెనాలి జిల్లా వైద్యశాలకు ప్రతిరోజు సుమారు వెయ్యి మంది అవుట్ పేషెంట్‌లు వైద్య సేవలు పొందుతుంటారు. వీరుకాకుండా సుమారు 200 మంది ఇన్ పేషెంట్స్ ఇక్కడ చికిత్స పొందుతుంటారు. తల్లిపిల్లల వైద్యశాలలో సుమారు 200 మంది అవుట్ పేషెంట్‌లు, వందకు పైగా ఇన్ పేషెంట్స్ చికిత్స పొందుతుంటారు. వీరిలో చాలా మందికి సిటీ స్కాన్ సేవలు అవసరం. వీరందరూ తెనాలిలో సిటీ స్కాన్ యూనిట్ సేవలు అందుబాటులో లేకపోవటం వల్ల ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనివల్ల ఆర్థిక భారం పేద ప్రజలపై పడుతోంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు సిటీ స్కానింగ్ యూనిట్‌ను తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఇండోర్ ఆటల పోటీలు



విద్యార్థులకు నీతి కథల బోధన




క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల ఇండోర్ ఆటల పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చెస్, క్యారమ్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. ఆయా కథల్లోని నీతిని గురించి విద్యార్థులతో చెప్పించారు. ఈ క్రమంలో ఈ నెల 3న శతక పద్య పోటీలు నిర్వహిస్తామన్నారు. 7న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందని గ్రేడ్–1 లైబ్రేరియన్ కావూరి రమాదేవి వెల్లడించారు. విద్యార్థులు ఖాళీ సమయాల్లో లైబ్రరీని సందర్శిస్తూ పుస్తక పఠనం మరింత బాగా అలవరచుకోవాలని సూచించారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ప్రోత్సహించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

వృద్ధులకు 'యంగ్ జనరేషన్' సాయం

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ యంగ్ జనరేషన్ టీమ్ సభ్యులు మరోసారి మానవత్వం చాటుకున్నారు. పలువురు వృద్ధులకు చేతి కర్రలు, నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని చెంచుపేటలో అనారోగ్యంతో చేతి వృత్తి చేసుకోలేని వృద్ధుడు ఉప్పలపాటి యాకోబుకు సంస్థ తరఫున 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావర సరుకులు అందజేశారు. అయితానగర్‌కు చెందిన కొడాలి లింగేశ్వరరావు అనే దివ్యాంగుడికి చేతికర్ర సాయం చేశారు. సాధిక్, శివ, బియ్యపు సాయి, నవీన్ పాల్గొన్నారు.


యోగాతో ఆనందకర జీవితం



సభలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

లక్ష్మీపురం: ఆధునిక జీవన శైలిలో ఒత్తిడిని తట్టుకుని ఆహ్లాదకరమైన జీవితాన్ని గడిపేందుకు నిత్య జీవితంలో యోగా, ధ్యానం సాధనాలుగా మార్చుకోవాలని యోగాచార్యులు, స్వామి వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు ఆళ్ల రాజేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో రాజేశ్వరరావు మాట్లాడారు. యోగా, ధ్యానాలు ఆరోగ్యానికి సంబంధించినవి మాత్రమే కాదని, అవి శక్తివంతమైన జీవన మార్గాలని సూచించారు. మనసును లగ్నం చేసి క్రమం తప్పకుండా సాధన చేస్తే మనిషిని శారీరకంగా, మానసికంగా ఉన్నత స్థితికి చేరుస్తాయని తెలిపారు. శారీరక, మానసిక భావోద్వేగాల్లో సమతుల్యత, స్థిరత్వం, దృఢత్వాన్ని సాధించాలంటే యోగా, ధ్యానం ప్రతి ఒక్కరూ జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ సభ్యులు యోగాచార్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ కుమారికి అభినందనలు



కుమారిని సత్కరిస్తున్న అజయ్ కుమార్, నాయకులు

లక్ష్మీపురం: ఇటీవల మంగళగిరి పట్టణంలో జరిగిన 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ (మెన్ అండ్ ఉమెన్) సబ్ జూనియర్, సీనియర్ పోటీల్లో నగరానికి చెందిన న్యాయవాది, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకురాలు పర్చూరు కుమారి రెండు రజిత పతకాలు సాధించడం అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. న్యాయవాది పర్చూరు కుమారి నంద సీనియర్స్ మహిళల విభాగం 76 కేజీల విభాగంలో 282.5 కేజీల బరువు ఎత్తి రజిత పతకం, అదే విభాగంలో బెంచ్ ప్రెస్ పోటీల్లో తలపడి మరొక రజిత పతకాన్ని సాధించినట్లు చెప్పారు. ఆమె జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఏజెంట్లు సిద్ధంగా ఉండాలి

ఇండియా కూటమి తరపున ఈ నెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో ఏజెంట్లు అన్ని పత్రాలతో సిద్ధంగా ఉండాలని గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.